క్లుప్తంగా

పరామర్శ



పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

బెజ్జూర్: మండల కేంద్రానికి చెందిన గుమ్ముల శ్రీనివాస్ ఇల్లు ఇటీవల షార్ట్‌సర్క్యూట్ కారణంగా కాలిపోయింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప బుధవారం ఆయన నివాసానికి చేరుకొని పరామర్శించారు. ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు రూ.10వేల ఆర్థిక సాయం అందజేశాడు.

శానిటరీ ప్యాడ్స్ అందజేత

వాంకిడి: మండలంలోని కేజీబీవీ పాఠశాల విద్యార్థులకు లర్నింగ్ కర్వ్, బీపీసీఎస్ సంస్థల ఆధ్వర్యంలో బుధవారం శానిటరీ పాడ్స్, ఇన్సినేటర్ మిషన్లు పంపిణీ చేశారు. విద్యార్థినుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని 'ప్రాజెక్ట్ డిగ్నిటీ' కార్యక్రమంలో భాగంగా ఏడాదికి సరిపడా శానిటరీ ప్యాడ్స్, ఇన్సినేటర్ మిషన్లు పంపిణీ చేస్తున్నట్లు సంస్థ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఈవో ఉదయ్‌బాబు, ఎంఎస్‌వో శివచరణ్, డిప్యూటీ తహసీల్దార్ శ్రావణ్, కాంప్లెక్స్ హెచ్‌ఎం నటరాజ్, జీఈసీవో భాగ్యలక్ష్మి, బీపీసీఎల్ మేనేజర్ శ్రావణ్ కుమార్, ఏఎస్సై శ్యాంరావు, ఆర్‌ఐ మాజిత్, తదితరులు పాల్గొన్నారు.

మల్టీపర్పస్ కార్మికుల సేవలు మరువలేనివి

తిర్యాణి: గ్రామ పంచాయతీ అభివృద్ధిలో భాగంగా మల్టీపర్పస్ వర్కర్స్ సేవలు మరువలేనివని ఎంపీడీవో వేముల మల్లేశ్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మల్టీపర్పస్ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. అనంతరం వారిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీవో సుధాకర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

షీటీం సేవలపై అవగాహన

ఆసిఫాబాద్‌రూరల్: మహిళలకు, చిన్నారులకు షీటం అండగా ఉంటుందని షీటీం సభ్యురాలు సునీత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో షీటీం సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ చట్టాలపై విద్యార్థులకు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, లైంగికంగా వేధిస్తే షీటీంకు సమాచారం ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో షీటీం సభ్యులు శ్రీలత, మహేశ్వరి, ప్రిన్సిపాల్ మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవోగా హన్మంతు



సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కౌటాల: కౌటాల ఇన్‌చార్జి ఎంఈవోగా గావుడె హన్మంతు బుధవారం స్థానిక విద్యా వనరుల కేంద్రంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో ప్రభుత్వ విద్యా బలోపేతం కోసం కృషి చేస్తామన్నారు. మెరుగైన విద్యను అందిస్తామని, పిల్లలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కౌటాల ఎంఈవోగా బాధ్యతలు స్వీకరించిన హన్మంతును ఎంఆర్‌సీ సిబ్బంది, ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు నానాజీ, ఎడ్ల తిరుపతి, అశోక్, రాములు, నైతం సాయినాథ్, సీఆర్పీలు ప్రకాశ్, లాలాజీ, దేవన్న, రవి, సిబ్బంది పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన పెద్దపల్లి కిషన్‌రావు ఇటీవల ది బెస్ట్ ఎడ్యుకేటర్ అవార్డు పొందగా బుధవారం శ్రీమిత్ర సేవా సమితి సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకరి తిరుపతి, గౌరవ అధ్యక్షుడు రాపెల్లి విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి

నార్నూర్: పారిశుధ్యం, క్లోరినేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో జవహర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం లోపం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నాటిన మొక్కలకు ట్రీగార్డులు ఏర్పాటు చేసి, వాటి సంరక్షణ కోసం చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీవో స్వప్నశీల, ఏపీవో సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

పత్తి కాత అంతంతే..!



ఏపుగా పెరిగిన పత్తి

- పంటకు తెగుళ్ల బెడద
- ఆశించిన స్థాయిలో కాయని కాత
- ఆందోళనలో అన్నదాతలు

రెబ్బెన: ఆశాజనంగా మొక్కలు కనిపిస్తున్నా.. పత్తి కాయలు మాత్రం అంతంత మాత్రంగానే ఉన్నాయి. సీజన్ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు పత్తి పంటలకు అనుకూలంగానే వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. పొడి దుక్కిలో విత్తనాలు విత్తుకోగా తొలకరి వర్షాలకు విత్తనాలు మొలకెత్తిన పంటలు పర్వాలేదనిపిస్తుండగా.. ఆ తరువాత మొలకెత్తిన పంట ల్లో కాత, పూతలు అంతంత మాత్రంగా కనిపిస్తుండటం రైతులను కలవర పెడుతున్నాయి. పంటలో పూత, కాతలకు వచ్చేందుకు రైతులు క్రిమిసంహారక మందులు విచ్చల విడిగా పిచికారీ చేయాల్సి వస్తోంది. దాంతో పంటల పెట్టుబడి ఖర్చులు గణనీయంగా పెరిగాయి. వాయుగుండం ప్రభావంతో వాతావరణంలో ఏర్పడిన మార్పులతో పత్తి పంటలకు తెగుళ్లు వ్యాపించి పంటలను దెబ్బతింటున్నాయి.

10 నుంచి 20 లోపే కాయలు..

మండలంలో అత్యధికంగా సాగయ్యే పంటల్లో పత్తిదే మొదటి స్థానం. 24 గ్రామ పంచాయతీల పరిధిలో ఈసారి సుమారు 26 వేల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. తొలకరి వర్షాల కంటే ముందే రైతులు విత్తనాలు విత్తుకున్నారు. అయితే ప్రారంభంలో ఆడపదడపగా పడిన తొలకరి వర్షాలతో పూర్తిస్థాయిలో విత్తనాలు మొలకెత్తగా రైతులు రెండోసారి, మూడోసారి విత్తనాలను విత్తుకోవాల్సి వచ్చింది. ఆశించిన వర్షాలు పడగా.. కొంత మంది రైతులకు చెందిన భూముల్లో మాత్రమే ఆశాజనంగా విత్తనాలు మొలకెత్తాయి. ప్రస్తుతం మండలంలో సాగవుతున్నా.. పత్తి పంటలకు మూడు నెలల కాలం పూర్తయింది. వర్షాలు అనుకూలంగా కురవడంతో పంటలు ఆశాజనకంగా కనిపిస్తున్నాయి. అయితే చాలా ప్రాంతాల్లో పత్తి చెట్లకు ఆశించిన స్థాయిలో కాయలు పడకపోవటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏపుగా, గుబురు మొక్కలు పెరిగినప్పటికీ కాత, పూతలు అంతంత మాత్రంగానే కనిపిస్తుండటంతో రైతులు కలవర పడుతున్నారు. గతంలో ఒక్కో చెట్టుకు 25 నుంచి 35 వరకు కాయలు పడగా ఈసారి తక్కువ సంఖ్యలో కాయలు కనిపిస్తున్నాయి.

ధర లేకపోతే నష్టాలు..

మరో రెండు నెలల్లో పత్తి చేతికి అందనుంది. అయితే సీజన్ ప్రారంభంలో ఉండే ధర పైనే రైతులు ఆశపెట్టుకుంటున్నారు. సాధారణంగా సీజన్ ప్రారంభంలో పత్తి వ్యాపారులు అధిక ధరల చెల్లించి పత్తిని కొనుగోలు చేస్తుంటారు. క్రమంగా మార్కెట్‌కు వచ్చే పత్తి పెరిగే కొద్ది ధర తగ్గిపోతుంది. గత సంవత్సరం సీజన్ ప్రారంభంలో క్వింటాల్‌కు రూ. 7వేల వరకు చెల్లించగా.. అపై క్రమంగా తగ్గుతూ వచ్చింది. సీజన్ ముగింపు దశకు చేరిన ధర పెద్దగా పెరగకపోవటంతో రైతులు నష్టపోయారు. కనీసం ఈసారైనా ఆశించిన స్థాయిలో ధర ఉండాలని రైతులు కోరుతున్నారు.

పంటలకు తెగుళ్లు..

విపరీతంగా తెగుళ్ల ఆశించి పత్తి పంటను పీల్చి పిప్పిచేస్తున్నాయి. వాతావరణంలో ఏర్పడుతున్న మార్పుల కారణంగా పంటల్లో ఆకుముడత ఉధృతి అధికంగా మారింది. పొగమంచు కారణంగా పత్తి పంటలకు పచ్చదోమ, తెల్లదొమ ఆశించి పంటలను దెబ్బతీస్తున్నాయి. పత్తి ఆకుల కింద దోమలు రసం పీలుస్తుండటంతో ఆకులు ముడతగా మారి ఎదుగుదల లోపిస్తోంది. దీంతో దోమను అరికట్టేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. రైతులు కాత, పూతల కోసం పంటలపై విపరీతంగా పిచికారీ చేయాల్సి వస్తోంది.

రూ. 10 వేలు చెల్లించాలి



పత్తి సాగులో పెరుగుతున్న పెట్టుబడులకు అనుగుణంగా ప్రభుత్వం మద్దతు ధర కల్పించటం లేదు. ప్రస్తుతం ఎకరం పత్తి పంటను సాగు చేయాలంటే గరిష్టంగా రూ.40 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. అంతలా ఖర్చు చేస్తే దిగుబడి మాత్రం ఎకరానికి 7 క్వింటాళ్లు మించటం లేదు.

– రంగు శ్రీనివాస్ గౌడ్, నంబాల

కాత అంతగా లేదు



గతంతో పోల్చితే ఈసారి పత్తి పంటల్లో ఆశించిన స్థాయిలో కాత కనిపించటం లేదు. గతంలో ఈసమయానికి ఒక్కో చెట్టుకు 30 వరకు కాయలు కనిపించేవీ. కానీ ఈసారి 20కి మించి కనిపించడం లేదు. అధిక వర్షాలతో పత్తి చెట్లు ఏపుగా పెరిగినప్పటికీ కాయలు మాత్రం అంతగా పడలేదు.

– వసంత్‌రావు, గోలేటి

తెగుళ్లు వ్యాపిస్తున్నాయి



పత్తి పంటల్లో తెగుళ్ల బెడద అధికంగా మారింది. ప్రస్తుతం ఆకు ముడత అధికంగా ఉంది. వాతావరణంలో ఏర్పడిన మార్పుల కారణంగా పొగమంచు ఏర్పడి పత్తిలో ఆకుముడత అధికంగా కనిపిస్తోంది. దానికి తోడూ తెల్లదోమ, పచ్చదోమ ఆశించి పంటలను దెబ్బతీస్తున్నాయి. వాటిని నివారించేందుకు అధికంగా మందులను పిచికారీ చేయాల్సి వస్తోంది.

– నగోషా కొండయ్య, గంగాపూర్

కథల పుస్తకాలతో పఠనాసక్తి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంఈవో అంజయ్య

తిర్యాణి: కథల పుస్తకాలతో పిల్లల్లో పఠనాసక్తిని పెంపొందించవచ్చని ఎంఈవో అంజయ్య అన్నారు. బుధవారం మండలంలోని విద్యావనరుల శాఖ కార్యాలయంలో రూ టు రీడ్ స్వచ్ఛంద సంస్థ రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గొండి, కొలామి, తెలుగు కథల పుస్తకాలు విద్యార్థులకు, ఉపాధ్యయులకు ఎంతో ఉపయోగపడే విధంగా ఉన్నాయన్నారు. దీనిలో అక్షరాస్యత అంశాలు, పఠన కృత్యములు, పుస్తక సంరక్షణ నియమాలు, గ్రంథాలయ నియమాలు, పుస్తకాలు ఇంటికి తీసుకెళ్లే నియమాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఆర్పీ రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న అధికారులు

సిర్పూర్(టి): గురుకులాలు, ఆశ్రమ పాఠశాలు, వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మండల ప్రత్యేకాధికారి, (డీపీఆర్‌ఈ) పి.ప్రభాకర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాల పరిసర ప్రాంతాలను, భోజన వసతిని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని సూచించారు. పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని, సీజనల్ వ్యాదులు ప్రబలకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీవో చంద్రయ్య, ప్రధానోపాధ్యాయుడు రవీందర్, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫార్మసిస్ట్ చట్టాలు అమలయ్యేలా చూడాలి



డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌ను సన్మానిస్తున్న సంఘం సభ్యులు

నేరడిగొండ: ఫార్మసిస్ట్ చట్టాలను అమలయ్యేలా చూడాలని ఫార్మసిస్ట్ సంక్షేమ సంఘం నాయకులు కోరారు. సెప్టెంబర్ 25 ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీలతను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమెను శాలువాతో సత్కరించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు అశోక్ మాట్లాడుతూ ఫార్మసిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు డి.కపిల్ కుమార్, జిల్లా కోశాధికారి మనోజ్, మండల అధ్యక్షుడు ఇసాఖొద్దీన్, ఫార్మాసిస్టులు పాల్గొన్నారు.

యువకుడు మృతి

ఆసిఫాబాద్‌రూరల్: అనుమానస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. బుధవారం స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఈదులవాడ గ్రామానికి పురుషోత్తం (32) ఉదయం పత్తికి మందు పిచికారీ చేసేందుకు తల్లి సురాక్కతో పాటు ఇద్దరు కూలీలను తీసుకొని పొలానికి వెళ్లాడు. పత్తికి మందు పిచికారీ చేస్తున్న సమయంలో తాగు నీరు అయిపోవడంతో తీసుకువస్తానని వెళ్లి తిరిగి రాలేదు. దీంతో తల్లి ఇంటికి వస్తున్న క్రమంలో వట్టివాగు ప్రాజెక్టు కాలువలో చనిపోయి ఉన్నాడు. కాలువలో నీరు కూడా తక్కువ ఉంది. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందని, పోస్టుమార్టం అనంతరం వివరాలు తెలుస్తాయని సీఐ సతీష్ తెలిపారు.

బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలి

పెంచికల్‌పేట్: బ్యాంకులో అందిస్తున్న సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని టీజీబీ ఎల్కపల్లి బ్రాంచ్ మేనేజర్ రామకృష్ణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎల్కపల్లి పంచాయతీ కార్యాలయంలో ఖాతాదారులకు అవగాహన కల్పించారు. ఖాతా కలిగిన ప్రతిఒక్కరూ ఇన్సురెన్స్ చేయించుకోవాలన్నారు. సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఖాతా వివరాలు, ఓటీపీ చెప్పవద్దని సూచించారు. అంతకు ముందు కళాజాత బృందం సభ్యులు పొదుపు ఖాతాలపైన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ గోపీ, ఏపీఎం కోనయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

మట్కా ఆడుతున్న ఒకరి అరెస్టు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని గాంధీచౌక్ వద్ద బుధవారం మట్కా ఆడుతున్న ఒకరిని అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ శంకరయ్య తెలిపారు. గాంధీచౌక్ వద్ద మట్కా ఆడుతున్నారనే సమాచారం మేరకు పట్టణ ఎస్సై సుధాకర్ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించామని పేర్కొన్నారు. అనుమానాస్పదంగా కనిపించిన అతీక్ షేక్‌ను తనిఖీ చేయగా, అతడి వద్ద మట్కాకు సంబంధించిన ఐదు చిట్టీలు, రూ.1500 నగదు స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు.

ఇసుక టాక్టర్ల పట్టివేత



స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని పెద్ద వాగు సమీపంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నట్లు సీఐ సతీశ్‌కుమార్ తెలిపారు. 11 ట్రాక్టర్లను పట్టుకొని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. స్థానిక తహసీల్దార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్లపై, యజమానులపై సెక్షన్ 302(2) బీఎన్‌ఎస్, సెక్షన్ 21 మైన్స్, మినరల్స్ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

గుడుంబా పట్టివేత

చింతలమానెపల్లి: మండల కేంద్రంలో బుధవారం 20 లీటర్ల గుడుంబా పట్టుబడినట్టు ఎస్సై ఇస్లావత్ నరేశ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలో పోలీసులు వాహనాల తనిఖీలు చేపడుతున్న క్రమంలో గూడెం గ్రామం నుంచి చింతలమానెపల్లికి బైక్‌పై 20 లీటర్ల గుడుంబా పట్టుబడిందన్నారు. గుడుంబాను తరలిస్తున్న జాడె కుమార్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్రీడాకారుడికి సన్మానం



సన్మానిస్తున్న ప్రిన్సిపాల్

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో గతంలో చదివిన తిరుపతి ఇటీవల నిర్వహించి అంతర్జాతీయ హ్యాండ్‌బాల్ యూత్ పురుషల ఛాంపియన్ షిప్‌లో ప్రతిభ కనబరిచాడు. దీంతో బుధవారం ప్రిన్సిపాల్ అబ్దుల్ రహీమ్ ఘనంగా సన్మానించారు. గురుకుల పాఠశాలలో ఇంటర్ వరకు చదివి అంతర్జాతీయ స్థాయి క్రీడాకారుడిగా ఎదగడం జిల్లాకు గర్వ కారణమన్నారు. ఈనెల 3 నుంచి 14 వరకు అమన్ బోర్డాన్‌లో జరిగిన అంతర్జాతీయ హ్యాండ్ బాల్ పోటీల్లో పాల్గొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీడీ శంకర్, యాదగిరి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

సాక్షి స్పందన



నిల్వ నీటిలో ఆయిల్ బాల్స్ వేస్తున్న సిబ్బంది

కౌటాల: గ్రామ పంచాయతీ పరిధిలో దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని కౌటాల గ్రామ పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ అన్నారు. బుధవారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన 'ఖాళీప్లాట్లు.. దోమలకు ఆవాసాలు' కథనానికి గ్రామపంచాయతీ అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ సిబ్బంది ఖాళీ ప్లాట్ల స్థలాల్లోని నీరు నిల్వ ఉన్న చోట ఆయిల్ బాల్స్ వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కౌటాల గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుధ్య పనులు చేయించి కాలనీల్లో బ్లీచింగ్ పౌడర్ వేయిస్తున్నామన్నారు. దోమల వ్యాప్తి చెందకుండా నీరు నిల్వ ఉన్న చోట ఆయిల్ బల్స్ వేయిస్తామన్నారు. ఓపెన్ ప్లాట్లలో నీరు నిల్వ ఉంటే సంబంధిత యజమానికి నోటీసులు అందిస్తామని తెలిపారు.

లాభాల నుంచి వాటా చెల్లించాలి



జీఎం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

రెబ్బెన: సింగరేణి సంస్థకు వచ్చిన మొత్తం లాభాల్లో నుంచి కార్మికులకు 33 శాతం వాటా చెల్లించాలని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు అన్నారు. బుధవారం టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో గోలేటి జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, జీఎం శ్రీనివాస్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం 70 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించటంతో సంస్థకు రూ. 4701 కోట్ల లాభాలు వచ్చాయన్నారు. అయితే మొత్తం లాభాల్లో కార్మికులకు 33 శాతం వాటా చెల్లించాల్సి ఉండగా.. రాష్ట్ర ప్రభుత్వం కంపెనీ అభివృద్ధి పేరిట సుమారు రూ. 2313 కోట్లను పక్కన పెట్టి కార్మిక వర్గాన్ని మోసం చేశారని ఆరోపించారు.

నర్సరీ కార్మికులకు బోనస్ చెల్లించాలి..

సింగరేణి నర్సరీల్లో పని చేస్తున్న కార్మికులకు సైతం లాభాల వాటా నుంచి రూ. 5వేల బోనస్ చెల్లించాలని శ్రీనివాస్‌రావు డిమాండ్ చేశారు. బుధవారం సాయంత్రం గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి నర్సరీని సందర్శించి, కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగరేణిలోని అన్ని విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులందరికీ రూ.5 వేల బోనస్ చెల్లించాలన్నారు. కార్యక్రమాల్లో సెంట్రల్ కమిటీ ఉపాధ్యక్షుడు మంగీలాల్, ఏరియా కార్యదర్శి వెంకటేశ్, అలవేణి సంపత్, ఓరం కిరణ్, సమ్మయ్య, వెంకటేశ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని వినతి



కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్తున్న కార్మికులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీలో విధులు నిర్వర్తిస్తున్న కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు వినతిపత్రం అందించారు. అంతకు ముందు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ మాట్లాడుతూ ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో పనిచేస్తున్న 144 మంది కార్మికులకు జీవో 60 ప్రకారం కేటగిరీ వారీగా వేతనాలు చెల్లించాలన్నారు. పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు మాట్ల రాజయ్య, తోట సమ్మయ్య, నాయకులు, కార్మికులు పెరిక శ్రీకాంత్, పద్మ, సుజాత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా జరగకుండా చర్యలు



ఇసుక డంప్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో లోకేశ్వర్

రెబ్బెన: మండలం నుంచి ఇసుక అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకుంటామని ఆర్డీవో లోకేశ్వర్ అన్నారు. బుధవారం మండలంలో దేవులగూడ, గోలేటి ఎక్స్‌రోడ్ ప్రాంతాలను మైనింగ్, రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం గంగాపూర్ వాగును పరిశీలించారు. వాగుల నుంచి ఇసుక అక్రమ రవాణా ఏ మార్గంలో జరుగుతుందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని వాగుల గుండా ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే అనేక సార్లు ఇసుక డంప్‌లను సీజ్ చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ ఆదేశాలను పట్టించుకోకుండా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మైనింగ్ ఏఈ గంగాధర్, తహసీల్దార్ రామ్మోహన్‌రావు, ఆసిఫాబాద్ సీఐ సతీష్, ఆర్‌ఐ ప్రేం కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు విజయవంతం చేయాలి



సభ్యత్వం అందిస్తున్న శ్రీనివాస్, నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం సభ్యత్వ నమోదు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలన్నారు. బాధ్యతగా తీసుకుని పని చేయాలన్నారు. అనంతరం పండిత్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దోని శ్రీశైలం, నియోజకవర్గ కన్వీనర్ వీరభద్రచారి తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ విద్యార్థి కష్టపడి చదవాలి

ఉట్నూర్‌రూరల్: ప్రతీ విద్యార్థి కష్టపడి చదివి, ఉన్నత లక్ష్యాన్ని చేరుకోవాలని బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్ అన్నారు. బుధవారం స్థానిక ఫంక్షన్‌హాల్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ప్రిన్స్‌పాల్స్ మెస్రం మనోహర్, ప్రతాప్‌సింగ్ మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి లక్ష్యంతో చదువుకోవాలని అందుకు ఇప్పటి నుండే ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. చెడు మార్గంలో వెళ్లవద్దని సూచించారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యం ఆకట్టుకుంది. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి. సాయిప్రసాద్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ నర్సింగ్‌రావు, లైబ్రేరియన్ చంద్రశేఖర్, అధ్యాపకులు అనిత, ముజీబ్, శ్రీకాంత్, తిరుపతి, నవీన్ పాల్గొన్నారు.